RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -151 పేజీలు - 04 వెల - 04/- గురువారం 9 జులై 2026

## ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు..

దక్షణ కొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

హ్యోసంగ్ గ్రూప్ ప్రతినిధులతో లోకేశ్ సమావేశం

కుప్పంలో ఫుట్‌వేట్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమకు ఓకే



**అమరావతి,జూలై 08,ఆంధ్ర ప్రగతి**

దక్షిణ కొరియా బుసాన్‌లో హ్యోసంగ్ గ్రూప్ ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఏపీలో హ్యోసంగ్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఆహ్వానం పలికారు. కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్ , మెటీరియల్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని లోకేశ్ సూచించారు. ఏపీలో నెక్ట్సజెన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్ ఆర్అండ్‌డీ, **మిగతా 2లో...**

## హాస్టళ్లు, గురుకుల విద్యార్థులకు

# డైట్ ఛార్జీలు 10% పెంపు


రూ.100 కోట్లతో హాస్టళ్లు, గురుకులాల మరమ్మతులు

ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు, మెరుగైన వసతులకు సీఎం ఆదేశం

ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సూచన

పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని కంపెనీలకు సీఎం ఆదేశం

కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని సూచన





**అమరావతి,జూలై 08,ఆంధ్ర ప్రగతి**

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి అందించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ పెంపును వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలన్న ఆర్థిక శాఖ సూచనను సీఎం తిరస్కరించారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే పెంపు అమల్లోకి రావాలని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.**మిగతా 2లో...**

## దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ తనిఖీలు




**న్యూఢిల్లీ జూలై 08,(ఆంధ్ర ప్రగతి**

దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు బుధవారం భారీగా సోదాలు చేపట్టారు. ఐసీస్ , ఏక్యూఐఎస్ ఉగ్రవాద కార్యకలాపాల ప్రచారంపై సోదాలు చేశారు. భారత్‌లో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు 10 రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. **మిగతా 2లో...**

## పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు

అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు


బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు



**టెహ్రాన్,జూలై 08,ఆంధ్ర ప్రగతి:**పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది.హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు**మిగతా 2లో...**

## ఉచిత పథకాలు ఎవరడిగారు?

: తెలంగాణ సర్కార్‌పై హైకోర్టు ఆగ్రహం



**హైదరాబాద్,జూలై 08,ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చట్టబద్ధతపై హైకోర్టు తీవ్ర సందేహాలను వ్యక్తం చేసింది. శాసనసభ ఆమోదం **మిగతా 2లో...**



## పెట్టుబడులపై ఆసక్తి

సిఎం రేవంత్‌రెడ్డి తో కెనడా బృందం భేటీ

**హైదరాబాద్,జూలై 08,ఆంధ్ర ప్రగతి**

కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి చూపించారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కెనడా ప్రతినిధులతో సీఎం కీలక చర్చలు జరిపారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం పలికారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం పలికారు. హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో కెనడా సహకారం కోరారు సీఎం. హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ-క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు.**మిగతా 2లో...**

## వైఎస్సార్ 77వ జయంతి..

ఇడుపులపాయలో నివాళి అర్పించిన జగన్, విజయమ్మ

వైఎస్సార్ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించిన వైసీపీ శ్రేణులు

ఇడుపులపాయలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న జగన్, విజయమ్మ, భారతి

హాజరైన వైసీపీ నేతలు, అభిమానులు

**ఇడుపులపాయ,జూలై 08ఆంధ్ర ప్రగతి**

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో వైసీపీ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని**మిగతా 2లో...**



## హస్తకళాకారులకు ఉచిత వైద్యశిబిరం

నరసాపురం,శ్రీకాళహస్తిలలో పరీక్షలు

డిప్యూటి సిఎం ఇచ్చిన హామీలో కదిలిన అధికారులు

**అమరావతి,జూలై 08,ఆంధ్ర ప్రగతి**

హస్తకళాకారులకు ఇచ్చిన మాటను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. డిప్యూటీ సీఎం చొరవతో నరసాపురం, శ్రీకాళహస్తిలో హస్తకళాకారులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇచ్చిన మాటను 24 గంటల్లోగా ఉప ముఖ్యమంత్రి అమల్లోకి తీసుకువచ్చారు. మంగళవారం ఏపీ హస్తకళా మహోత్సవంలో హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఆయన మాట ఇచ్చిన విషయం తెలిసిందే.**మిగతా 2లో...**



## ఎస్సీలను పావులుగా వాడుకుంటున్నారు

రాజకీయ నేతల తీరుపై మండిపడ్డ మాధవ్



2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

**మొదటిపేజీ తరువాయి**

చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్ లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టా÷–గ్గ÷ట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ–9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు. ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిసైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్‌ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దాడికి తామే బాధ్యులమని ఇరాన్ ఇప్పటి వరకు ప్రకటించలేదు.

# ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు..

**మొదటిపేజీ తరువాయి**

ఆసియా–పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కుప్పం కేంద్రంగా దక్షిణ భారత సమగ్ర ఫుట్‌వేర్ తయారీ క్లస్టర్‌కు ప్రతిపాదన చేశారు. తిరుపతిలో విడిభాగాల తయారీ, విశాఖపట్నంలో డిజైన్, లాజిస్టిక్స్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఏపీలో టైర్–1, టైర్–2 వెండర్లతో సప్లయర్ మీట్ నిర్వహించాలని హ్వాసంగ్‌కు ఆహ్వానం పలికారు. కుప్పంలో రూ.900 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ నాన్ – లెదర్ ఫుట్‌వేర్ ఎ÷–లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు హ్వాసంగ్ ప్రతినిధులు తెలిపారు. ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూల తయారీ లక్ష్యంగా హ్వాసంగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనుందని ప్రతినిధులు వివరించారు. అడిడాస్ సహా గ్లోబల్ బ్రాండ్లకు క్షఇఓ సరఫరాదారుగా హ్వాసంగ్ ఉండనుందని వెల్లడించారు. తొలి దశలో ఎగుమతులు.. ఆపై దేశీయ మార్కెట్‌పై దృష్టి సారించినట్లు చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని హ్వాసంగ్ ప్రతినిధులు తెలిపారు. అలాగే బుసాన్‌లోని షూఆల్స్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ ఫ్యాక్టరీని మంత్రి లోకేశ్ సందర్శించారు. అధునాతన టెక్నాలజీతో బూట్ల తయారీ ప్రక్రియను పరిశీలించారు. మెడికల్ మాగ్నెటిక్ జనరేటర్లు, స్మార్ట్ చిప్‌లతో తయారయ్యే షూస్‌పై ఆసక్తి కనపరిచారు. పాదాల ఆరోగ్యానికి ప్రత్యేక వైబ్రేషన్ చిప్ టెక్నాలజీని లోకేశ్ పరిశీలించారు. రక్తప్రసరణ మెరుగుదల, కండరాల అలసట తగ్గించే స్మార్ట్ ఫుట్‌వేర్ తయారీ గురించి ఆయన తెలుసుకున్నారు. 'పాదరక్షలు, షూ లేసులు, మెటల్ హార్డ్‌వేర్, అనుబంధ పరికరాల తయారీలో పేరెన్నికగన్న బూ యంగ్ గ్రూప్ సీఈవో , ప్రెసిడెంట్ డైరెక్టర్ ర్యాన్ కాంగ్, బిజినెస్ స్ట్రాటజీ ,ప్లానింగ్ మేనేజర్ మిల్లీ రిచర్డ్‌సన్‌లతో బుసాన్‌లో సమావేశ మయ్యాను. ఆంధ్రప్రదేశ్‌లో బూ యంగ్ గ్రూప్ పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాను. సింగిల్ విండో విధానంలో అనుమతులతోపాటు రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జోన్లలో కంపెనీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కనెక్టివిటీ సిద్ధంగా ఉన్నాయని వివరించాను' అని లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# డైట్ ఛార్జీలు 10% పెంపు

**మొదటిపేజీ తరువాయి**

విద్య ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జీవితాల్లో మార్పు వస్తుందని, అందుకే వారికి అన్ని విధాలా మెరుగైన అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

సంక్షేమ శాఖల సమీక్షలో ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. హాస్టళ్ల స్థానంలో మరిన్ని గురుకులాలు నిర్మించాలని, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మత్తులకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతిభావంతులైన ఇంటర్ విద్యార్థులకు పైలట్ ప్రాజెక్టు కింద ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే సంక్షేమ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు.

పొగాకు కొనుగోళ్లపై కూడా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కిలోకు రూ.200 కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని కంపెనీలను ఆదేశించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోళ్లు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టొద్దని హెచ్చరించారు. టొబాకో బోర్డు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అయితే అవసరానికి మించి పొగాకు సాగు కావడం, ఎగుమతులు తగ్గడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని అధికారులు, కంపెనీల ప్రతినిధులు సీఎంకు వివరించారు.

# మతాల మధ్య చిచ్చు పెట్టే యత్నం

## హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు -వారికి జగన్ వత్తాసు పలకడం మరీ దారుణం

## మండిపడ్డ మంత్రులు ఆనం, సత్యకుమార్ యాదవ్

**అమరావతి, జూలై 8ఆంధ్ర ప్రగతి**

భారతీయులు, హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్న వారిని జగన్ సమర్థించడం, చిచ్చు పెట్టేలా చేయడం దారుణమని ఎపి మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఇలాంటి నీచానికి దిగజారుతారా అని ప్రశ్నించారు. ఇలాంటి వారిని గొడ్డలి పార్టీ సమర్థించడం భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ రాజ్యాంగానికి పెడర్థాలు తీసి ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. సమాజాన్ని తమవైపు తిప్పుకోవడానికి మత విద్వేషాలు రెచ్చగొడతారా అని మంత్రి ఆనం ప్రశ్నించారు. ఒక వ్యక్తి రావణ్ పేరుతో హిందువుల మనోభవాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తూ పీఠాధిపతులను కూడా విమర్శించే స్థాయికి జగన్ అండ్ కో వెళ్లిపోయారని మండిపడ్డారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని రాజారెడ్డి రాజ్యాంగంలో రాసుకున్నారా? అని ప్రశ్నించారు. సామాన్యుల మనుగడను దెబ్బతీసే ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తున్న జగన్ రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 19(1ఏ) భావస్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ కల్పించినట్లే... మత విశ్వాసాలను, స్వేచ్ఛను పరిరక్షించే హక్కులను రాజ్యాంగం కల్పించిందని మంత్రి ఆనం తెలిపారు. రాజ్యాంగం ఇవ్వని భావ






ప్రకటన స్వేచ్ఛ తమకుందని చెప్పుకుంటూ అనేక వర్గాలను, మతాలను వేరు చేయాలని జోసఫ్ రావణ్ అనే వ్యక్తి ద్వారా జగనే చేయిస్తున్నారని ఆరోపించారు. మతాలను అగౌరవపరచమని ఏ రాజ్యాంగం చెప్పిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై చట్టాలు తన పని తాను చేసుకోవాల్సి ఉందని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. కులమత విద్వేషాలు పెంచేలా చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. రాజకీయంగా సానుకూల వాతావరణం ఉన్నప్పుడు లబ్ది పొందాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చట్ట పరిధిలో మత విద్వేషాలు రేకెత్తిస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు. పక్క రాష్ట్రాల నుంచి వీడియో మెసేజ్‌లు పంపుతూ విద్వేషాలు రేకిస్తున్నారని ఆరోపించారు. హిందుత్వ మూలాలు దెబ్బతీసేలా కుట్రపూరితంగా జగన్ మాట్లాడారంటూ విరుచుకుపడ్డారు. విద్వేషాలకు ఊతమిచ్చేలా నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. జగన్ హయాంలో మూడు ప్రాంతాలనూ అభివృద్ధి చేయలేదని మంత్రి విమర్శించారు. మావిగన్ అనే అసంబద్ధమైన వాదన తీసుకొచ్చారన్నారు. పొంతన లేకుండా మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక ఆలోచనలు జరుగుతున్నాయని.. స్థానిక ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ముందుకెళతామని చెప్పారు. త్వరలోనే స్థానిక ఎన్నికల్లో ఎవరు.. ఎక్కడ పోటీ చేయాలనే దానిపై పార్టీ అధినాయకత్వాలు నిర్ణయిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# ఉచిత పథకాలు ఎవరడిగారు?

**మొదటిపేజీ తరువాయి**

లేకుండా కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోల) ద్వారా ఈ పథకాలను ఏ విధంగా అమలు చేస్తారని ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పథకాలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ బుధవారం విచారించారు. చట్టసభ ఆమోదం లేకుండా ప్రజాధనాన్ని పంపిణీ చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 245, 246లకు విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఈ పథకాలకు సంబంధించి జారీ చేసిన 8 జీవోలను రద్దు చేయాలని కోరారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఉద్యోగులకు జీతాలు ఆలస్యమవుతున్నాయి, కాంట్రాక్టర్ల బిల్లులు, భూసేకరణ పరిహారం వంటివి పెండింగ్‌లో ఉన్నాయి, నిధుల కోసం ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారు. మరోవైపు రాష్ట్రం అప్పుల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఉచిత పథకాలను ఎవరు అడిగారు?" అని కోర్టు ఘాటుగా ప్రశ్నించింది. ప్రభుత్వం వద్ద అదనపు నిధులు ఉంటే ఉచితాలు ఇవ్వవచ్చని, కానీ చెల్లింపుల విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రాధాన్యత ఉండాలని హితవు పలికింది. 2014లో ప్రారంభమైన ఈ పథకాల కింద ఇప్పటివరకు రూ.13,484 కోట్లు ఖర్చు చేశారని, కాగ్ నివేదికల ప్రకారం సుమారు రూ.90 కోట్లు అనర్హులకు అందాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకే ఈ పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. ఇరుపక్షాల వాదనల అనంతరం, నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. అయితే, ఈ పథకాలపై తక్షణ స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.

# ఎస్సీలను పావులుగా వాడుకుంటున్నారు

## రాజకీయ నేతల తీరుపై మండిపడ్డ మాధవ్

**విజయవాడ,జూలై 08,ఆంధ్ర ప్రగతి**



రాష్ట్రంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని.. ఎస్సీలను పావులుగా వాడుకుని రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరినైనా ఏది పడితే అది మాట్లాడొచ్చని అనుకుంటున్నారని.. హిందూ దేవతలను తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడిన తర్వాత అరెస్టు చేస్తే హక్కుల ఉల్లంఘన అంటున్నారన్నారు. సినిమా తారలు, యూట్యూబర్స్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వీరిపై ఎందుకు దేశద్రోహం కేసులు పెట్టకూడదని ప్రశ్నించారు. ఉపా చట్టం కింద కేసులు ఎందుకు పెట్టకూడదో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎస్సీలను వాడుకుంటున్నారని ఆరోపించారు. విదేశీ శక్తులు కూడా కుట్రలో పాలు పంచుకుంటున్నాయన్నారు. విద్రోహ కార్యకలాపాలు చేసే వాళ్లు అందరూ ఇక్కడకు చేరుకుంటున్నారని తెలిపారు. హైకోర్టు తీర్పును ఉద్దేశించి పలువురు సభలు పెట్టి మాట్లాడుతున్నారని అన్నారు. ఏపీలో పెద్ద నాటకం జరుగుతోందని మాధవ్ అన్నారు. జోసెఫ్ తన పేరును రావణ్ అని మార్చుకున్నారని తెలిపారు. హిందువులపై విషం కక్కుతున్నారని వ్యాఖ్యానించారు. సంఘ విద్రోహ శక్తులను రాష్ట్రంలో తిరగనివ్వకూడదని మాధవ్ పేర్కొన్నారు.

--------

# పెట్టుబడులపై ఆసక్తి

**మొదటిపేజీ తరువాయి**

ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్‌లో తెలంగాణ పురోగతిని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణపై కెనడా కంపెనీల విశ్వాసం పెరుగుతోందని సీఎం రేవంత్, క్రిస్ కూటర్ తెలిపారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డిని అంతర్జాతీయ ప్రతినిధులు కలిశారు. నిలి గిల్బర్ట్, మహేశ్ కొండూరు అమిత్ మెహ్రా ,దిలెక్ , థామస్ ఫ్రోలిక్, సెంథిల్ తొండమాన్, సీఎంని కలిసిన వారిలో ఉన్నారు.

# హస్తకళాకారులకు ఉచిత వైద్యశిబిరం

**మొదటిపేజీ తరువాయి**

పవన్ కల్యాణ్ సూచనతో హస్తకళాకారుల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే విధంగా క్లస్టర్ల వారీగా వైద్య శిబిరాలను అధికారులు ప్రారంభించారు. నరసాపురంలో 105 మంది లేస్ కళాకారులకు పరీక్షలు నిర్వహించగా, 37 మందికి కంటి సంబంధిత సమస్యలు ఉన్నట్లుగా నిర్ధారించారు. అందులో 16 మందికి కళ్లలో శుక్లాలు ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. అవసరమైన వారికి వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో శస్త్రచికిత్స చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నపాటి దృష్టి సమస్యలు ఉన్న 21 మందికి కళ్ల జోళు ఇప్పించేలా ఏర్పాట్లు చేశారు. శ్రీకాళహస్తిలో మొత్తం 53 మంది హస్తకళాకారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక పరీక్షలతో పాటు అన్నిరకాల ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మహాలక్ష్మితోపాటు అందే లక్ష్మి అనే మరో లేస్ కళాకారిణినిని ప్రత్యేక వాహనంలో పెదకాకాణిలోని శంకర కంటి ఆస్పత్రికి పిలిపించి పవన్ కల్యాణ్ పరీక్షలు చేయించారు. ఇరువురికీ దృష్టి దోషాలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. కళ్లజోళ్లు, ఐ డ్రాప్స్, మందులు ఇచ్చి పంపించారు.

# వైఎస్సార్ 77వ జయంతి..

**మొదటిపేజీ తరువాయి**

వైసీపీ అధినేత జగన్ కడప జిల్లా ఇడుపులపాయకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి, అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం తన తండ్రి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతితో పాటు వైసీపీకి చెందిన ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై అంజలి ఘటించారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని వైసీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు.

# దేశవ్యాప్తంగా ఎన్ఐఏ సోదాలు

**మొదటిపేజీ తరువాయి**

ఈ సోదాల్లో పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 11 మంది నిందితులు, ఓ బాలుడిని జువెనైల్ నుంచి అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. విజయవాడ పోలీసులు మార్చిలో నమోదు చేసిన కేసును మేలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలో ఐసీస్, ఏక్యూఐఎస్‌కు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ ఆధారంగా ఎన్ఐఏ అధికారులు ఇవాళ సోదాలు నిర్వహించారు. అరెస్టైన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా సంబంధాలు కొనసాగిస్తూ ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన వారిని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.

# గూటుపల్లి రైతులకు ఊరట.

**..నిషేధిత జాబితా నుండి 2074 ఎకరాలు తొలగింపు. ..రైతుల సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్.**

**..గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తున్నామని వెల్లడించిన మైనారిటీ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్.**

**ఆంధ్ర ప్రగతి అమరావతి, జులై 08:**
నంద్యాల జిల్లా డోన్ అసెంబ్లీ నియోజకవర్గం బేతంచర్ల మండలంలోని గూటుపల్లి గ్రామ భూములకు నిషేధిత భూముల జాబితా నుండి విముక్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గూటుపల్లి పరిధిలో నిషేధిత జాబితాలో కొనసాగుతూ వస్తున్న 2074.59 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ జీవో నెంబర్ - 77ను బుధవారం ప్రభుత్వం జారీ చేసింది. రైతుల వినతి మేరకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని గూటుపల్లి గ్రామ పరిధి లోని 142 సర్వే నెంబర్లలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేసినట్లు మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు.గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తున్నామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.




**వక్ఫ్ ఆస్తుల జాబితాలోకి చేర్చడంతో ఇబ్బందులు**

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రెవిన్యూ శాఖలో తీసుకున్న అసంబద్ధమైన నిర్ణయాలతో రైతులకు సంబంధించిన, సాగు చేసుకుంటున్న భూములను నిషేధిత 22ఏ జాబితాలోకి చేర్చడం తో పట్టాదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామ పరిధిలోని భూములు కూడా ఆనాడు 22ఏ జాబితా లోకి చేరాయి. గ్రామంలో ఉన్న 215 సర్వే నంబర్లను (195 పట్టా భూములు, 18 సర్వీస్ ఇనామ్ భూములు మరియు 2 ఎండోమెంట్ భూములు) రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ(1)(సి ) కింద నిర్వహించబడుతున్న నిషేధిత ఆస్తుల జాబితాలో వక్ఫ్ ఆస్తులుగా చేర్చారు. దీని ఫలితంగా దాదాపు 1,000 మంది ఖాతాదార్లు రిజిస్ట్రేషన్లు, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులు పడుతూ వచ్చారు. గూటుపల్లి సమస్య మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వద్దకు వచ్చింది. వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్ విచారణ చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, వక్ఫ్ బోర్డు సీఈఓ యాకుబ్ భాషా లను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు విచారణ చేసిన అధికారులు గూటుపల్లి గ్రామంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చబడి, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనని నివేదించారు. ఫలితంగా 142 సర్వే నంబర్లలోని 2074.59 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22-ఎ(1)(సి) కింద నిర్వహించబడుతున్న నిషేధిత ఆస్తుల జాబితా నుండి తొలగించాలని ఆదేశిస్తూ జీవో నెంబర్ -77 ను ప్రభుత్వం జారీ చేసినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న మరో 613.84 ఎకరాల విస్తీర్ణం గల మిగిలిన 74 సర్వే నంబర్ల విషయంలో తదుపరి సవివరమైన పరిశీలన మరియు ధృవీకరణ అవసరముందని, త్వరలో దీనిని కూడా పరిష్కరిస్తామని మంత్రి అన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టి ఉత్తర్వులు జారీ చేసిందని మైనారిటీ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కాగా తమ గ్రామ సమస్యను, రైతుల ఇబ్బందులను ప్రత్యేకంగా గుర్తించి నిషేధిత జాబితా నుండి తమ భూములను తొలగించడం పట్ల గూటుపల్లి రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## జిల్లా జైలు ఆకస్మిక తనిఖీ చేసిన న్యాయమూర్తి.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జులై 08:** ఎనిమిదో తేదీ బుధవారం నాడు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి జిల్లా కారాగారము తనిఖీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను మరియు ములాకత్ ఏరియా లో గల హెల్ప్ డెస్క్ ను తనిఖీ చేసి “జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్“ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్ ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు.ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు.70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తా మని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైధి లకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధి లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివ రామ చంద్ర రావు, హెల్ప్ డెస్క్ న్యాయ వాది ప్రవీణ్ కుమార్ మరియు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయ వాది చిన్న రాందాస్,పారా లీగల్ వాలంటీర్ హేమంత్, పురుషులు మరియు మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

# ఈనెల 18, 19వ తేదీలలో నంద్యాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు.

**.. జూలై 18, 19వ తేదీలలో నంద్యాలలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలు.**


**..జూలై 11వ తేదీ రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టు చెస్ ఎంపిక పోటీలు.**

**..రాష్ట్రస్థాయి చెస్ పోటీల కరపత్రాలు విడుదల చేసిన నంద్యాల జిల్లా చెస్ సంఘం చైర్మన్ డాక్టర్ రామకృష్ణ రెడ్డి, అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 08:** ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో ఈనెల 18, 19వ తేదీలలో నంద్యాల ఎస్బిఐ కాలనీలో ఉన్న రామకృష్ణ పిజి కళాశాలలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈనెల 11వ తేదీ రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బుధవారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన, జిల్లా సంఘం కార్యదర్శి రామ సుబ్బారెడ్డి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్, నంద్యాల జిల్లా చెస్ సంఘం చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని రాష్ట్రస్థాయి పోటీల కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలో జరుగుతున్న సీనియర్ చెస్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 11వ తేదీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి ఏటా ఒక రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ నంద్యాలలో నిర్వహిస్తున్నామని, నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలలో, ఆసక్తి ఉన్న చెస్ క్రీడాకారులందరూ పాల్గొనాలని ఆహ్వానించారు. జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏపీ చెస్ వెబ్సైట్ ద్వారా క్రీడాకారులు ఎంట్రీలు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలు 9010451585 నెంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్,మేడా చంద్రశేఖర్, జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజా చక్రవర్తి పాల్గొన్నారు.

# గంగుల నాని కి ఓపెన్ ఛాలెంజ్ విసిరిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జులై 08:** వాస్తవాలు నిరూపించ లేకపోతే గంగుల నాని నీ ఇంటి దగ్గరికి వస్తాను అంటూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హెచ్చరించారు.నువ్వు చేసిన ఆరోపణ పైన అహోబిలంలో డిబేట్ కు నేను సిద్ధం నువ్వు సిద్ధమా అంటూ గంగుల నానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సవాల్ విసిరారు.నువ్వు చేసిన ఆరోపణలు సాయంత్రం లోపల నిరూపించలేక పోతే గంగుల నాని నీ ఇంటి మీదికి వస్తా అంటూ హెచ్చరించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.నువ్వు నా పైన చేసిన ఆరోపణలు నిరూపిస్తే నేను సీఎం సమక్షంలోనే రాజీనామా చేసి రాజకీయాలకు దూరంగా ఉంటాను నిరూపించలేక పోతే నువ్వు ఏం చేస్తావ్ అంటూ గంగుల నానిని హెచ్చరించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.తమిళనాడుకు తలనీలాల టెండర్ అంశంలో గంగుల నాని చూపిస్తున్న ఒప్పంద పత్రాలు ఆయనకు ఎలా వచ్చాయని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రశ్నించారు. టెండర్ల విషయంలో స్పష్టత లేకపోవడం వల్లే తాము అభ్యంతరం తెలిపామని, దాన్ని అడ్డుకున్నామని ఎమ్మెల్యే అఖిల ప్రియ స్పష్టం చేశారు. సీఈఓ పార్థసారధి పై ఇతర రాష్ట్రాల్లో చీటింగ్, క్రిమినల్ కేసులు ఉన్నాయని, రాంచీ కోర్టు ఆయనను “పర్మనెంట్ అబ్స్కాండర్“గా ప్రకటించారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆరోపించారు.అలాంటి వ్యక్తిపై నమ్మకం లేకపోవడం వల్లే టెండర్ల విషయంలో సందేహాలు వ్యక్తం చేస్తున్నామని టెండర్ ప్రక్రియ ముందే తమిళనాడు వారికి కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని మాజీ సీఏఓ పార్థసారధిని ప్రశ్నించినట్లు భూమా అఖిలప్రియ వెల్లడించారు.లా అండ్ ఆర్డర్ సమస్యల కారణంగా టెండర్లను వాయిదా వేస్తున్నట్లు సీఎవో అధికారికంగా లేఖ ఇచ్చారని చెప్పారు. టెండర్లు వాయిదా పడిన తర్వాత కూడా తమిళనాడు సంస్థతో ఒప్పందం ఎలా జరిగిందో గంగుల నాని సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ డిమాండ్ చేశారు.ఈ మొత్తం వ్యవహారంలో ఎవరు ఎవరికి సమాచారం ఇస్తున్నారు. ఎవరి పాత్ర ఏమిటో బయటపడాల్సిన అవసరం ఉందని కాబట్టి గంగుల నాని కి ఓపెన్ ఛాలెంజ్ చేసిన ఎమ్మెల్యే వాస్తవాలు తీర్చలేకపోతే గంగుల నాని ఇంటి దగ్గరికి వస్తానని హెచ్చరించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

# మహానంది వ్యవహారంపై వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కిషోర్ కుమార్ ఆగ్రహం.!

**..దర్శనం అనంతరం భక్తులను అనవసరంగా 500600 మీటర్లు తిప్పుతున్నారని ఆరోపణ.**

**..5 నవగ్రహ దీపారాధన టికెట్ ఆదాయం కోసమే భక్తులకు ఇబ్బందులు పెడుతున్నారని విమర్శ.**

**..ఒకేచోట వేలాది దీపాలు వెలిగించడం వల్ల నవగ్రహ విగ్రహాలు దెబ్బతినే ప్రమాదమని ఆందోళన.**

**..దేవాదాయ శాఖ అధికారులు కమర్షియల్ ధోరణితో వ్యవహరిస్తున్నారని వీహెచ్‌పీ ఆరోపణ.**

**..మహానంది క్షేత్రంలో డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలని డిమాండ్.**

**..భక్తుల సౌకర్యాలు, ఆలయ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి.**




**ఆంధ్ర ప్రగతి మహానంది జులై 08:**
నంద్యాల జిల్లా మహానంది శ్రీ మహానందీశ్వర స్వామి దేవస్థానంలో నవగ్రహ దీపారాధన వ్యవహారంపై మరోసారి విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా కార్యదర్శి కిషోర్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యాలను పక్కనబెట్టి ఆదాయానికే ప్రాధాన్యం ఇస్తున్నారని దేవాదాయ శాఖ అధికారులపై మండిపడ్డారు.
సాధారణ దర్శనానికి వచ్చే భక్తులను దర్శనం అనంతరం నేరుగా బయటకు పంపకుండా, కేవలం నవగ్రహ దీపారాధన టికెట్ల ఆదాయం కోసం అవసరం లేకపోయినా 500 నుంచి 600 మీటర్ల దూరం ఆలయం చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. దీంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.
నవగ్రహాల వద్ద ఒకేసారి వందలాది, వేలాది దీపాలు వెలిగించడం వల్ల తీవ్రమైన వేడి ఏర్పడి, ఆ సెగతో నవగ్రహ విగ్రహాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ సంప్రదాయాలు, ఆగమశాస్త్రాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఆదాయం కోసం ఈ విధానం అమలు చేస్తున్నారని విమర్శించారు.
మహానంది వంటి ప్రముఖ శైవ క్షేత్రంలో డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాల్సి ఉండగా, అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారినే ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న కారణాలపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేవాలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తుంటే, కిందిస్థాయి అధికారులు మాత్రం కమర్షియల్ ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ నవగ్రహ దీపారాధన విధానాన్ని పునఃసమీక్షించాలని, ఆలయ పరిరక్షణకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మిశ్రమ పంటలు సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలి.

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 08:**
మిశ్రమ పంటలు సాగు చేసే విధంగా ఆర్ఎస్కే సిబ్బంది రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆర్ఎస్కే సిబ్బందిని ఆదేశించారు.
బుధవారం ఆస్పరి మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం - 1, 2 లను ఆకస్మిక తనిఖీ చేసి, అక్కడ ఉన్న రైతులకు మిశ్రమ పంటల సాగు గురించి కలెక్టర్ అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ వ్యవసాయ శాఖ సిబ్బందితో మాట్లాడుతూ రైతులు ఒకే పంట సాగు చేయకుండా మిశ్రమ పంటలు సాగు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆర్ఎస్కే సిబ్బందితో మాట్లాడుతూ గ్రామ సచివాలయం పరిధిలో ఎంత మేర భూమి ఉంది అందులో ఒకేపంట సాగు ఎన్ని ఎకరాల్లో జరిగింది, మిశ్రమ పంటల సాగు ఎన్ని ఎకరాల్లో జరిగిందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మిశ్రమ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. యూరియా ఎంత పంపిణీ చేశారు, వేరుశనగ, కందుల విత్తనాలు ఎంత పంపిణీ చేశారనే వివరాలను కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశాలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించి, అందుకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాలపై రైతులకు మార్గనిర్దేశం చేయాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ అక్కడే ఉన్న రైతులతో మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా , అని రైతులను అడిగి తెలుసుకున్నారు.. మిశ్రమ పంటల సాగు గురించి వ్యవసాయ శాఖ సిబ్బందికి మీకు అవగాహన కల్పిస్తున్నారా , లేదా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు ఒకే పంటను సాగు చేయకుండా, మిశ్రమ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఒకే పంట సాగు చేస్తే ప్రకృతి వైపరీత్యాలు లేదా వర్షాభావం కారణంగా నష్టం సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, మిశ్రమ పంటల సాగు ద్వారా ఒక పంట నష్టపోయినా మరో పంట ద్వారా రైతులకు ఆదాయం లభించి కుటుంబ ఖర్చులకు ఆసరాగా ఉంటుందని కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు.



సచివాలయం -2 లో అంగవైకల్యం తో బాధ పడుతున్న పిల్లవాడికి పెన్షన్ ప్రతిపాదనలు పెట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. డిజిటల్ అసిస్టెంట్ లు అందిస్తున్న సేవల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సదరం సర్టిఫికెట్ కొరకు సచివాలయంలో స్లాట్ బుక్ చేసుకొని ఆసుపత్రిలో పరీక్షలకు హాజరై సదరం సర్టిఫికెట్ పొందాలని కలెక్టర్ సచివాలయంలో ఉన్న ప్రజలకు తెలిపారు. బాల్య వివాహాలు చేయకుండా ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి కలెక్టర్ ప్రజలకు అవగాహన కల్పించారు.. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాత్రి పూట బడిలో చేరి చదువుకొని అక్షరాసులుగా మారాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. తమ ప్రాంతంలో జింకలు అధిక సంఖ్యలో సంచరిస్తుండటంతో కంది, జొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, నీటి సమస్య ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా సంబంధిత సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.
కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డిపిఓ భాస్కర్, సర్వ శిక్ష అభియాన్ పీవో లోకరాజ్ , ఎంపిడిఓ గీత వాణి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి.

**..బాల్యవివాహాల నిర్మూలనలో భాగస్వాములు కావాలి.**

**..ఆస్పరి జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు/అస్పరి జూలై:08:**
విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, అదే సమయంలో బాల్యవివాహాల నిర్మూలనలో ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సూచించారు.
బుధవారం ఆస్పరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ఆత్మీయంగా ముఖాముఖి నిర్వహించి వారి చదువు, భవిష్యత్ లక్ష్యాలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు.
కలెక్టర్ మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే లక్ష్యంతో చదవాలని సూచించారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో విజయం సాధించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో కలెక్టర్, డాక్టర్, పోలీసు అధికారి, ఇంజనీర్, ఉపాధ్యాయుడు వంటి ఉన్నత పదవులను లక్ష్యంగా పెట్టుకున్న వారు ఎంతమంది ఉన్నారని అడిగి వారిని ప్రోత్సహించారు. పెద్ద కలలు కనాలని, ఆ కలలను సాధించేందుకు పట్టుదలతో శ్రమించాలని సూచించారు.
ఈ సందర్భంగా ముఖ్యంగా బాలికలను ఉద్దేశించి జిల్లాలో ఇంకా కొన్ని ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు ఎక్కడైనా తెలిసినా వెంటనే తమ ఉపాధ్యాయులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తమ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, బంధువులకు కూడా





బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఇంట్లో ఆడపిల్లల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని, అక్కాచెల్లెళ్లను తప్పనిసరిగా చదివించాలని తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులను ప్రత్యేకంగా ప్రశ్నించిన కలెక్టర్ అక్కడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల పరిస్థితి, పరిశుభ్రత, ఇతర మౌలిక వసతులపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఎటువంటి ఇబ్బందులు లేవని, అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. కుటుంబ విలువల గురించి ప్రస్తావిస్తూ ప్రస్తుతం ఆస్తి వివాదాల కారణంగా అన్నదమ్ముల మధ్య విభేదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కుటుంబ బంధాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అవసరమైతే ఒకరికొకరు త్యాగం చేయడం నేర్చుకోవాలని, ప్రేమాభిమానాలతో కలిసి మెలిసి జీవించాలని విద్యార్థులకు హితవు పలికారు. పాఠశాలల్లో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్ విద్యార్థులకు వివరించారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను కూడా స్వయంగా తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచడం కూడా సమానంగా ముఖ్యమని చెప్పారు. మొబైల్ ఫోన్ల వినియోగంపై కూడా విద్యార్థులకు సూచనలు చేశారు. మొబైల్‌ను విద్యాభ్యాసం, జ్ఞానార్జన, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని, అనవసరమైన విషయాలకు దూరంగా ఉండాలని సూచించారు.
అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా రుచి చూసి ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం గురించి మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత, మెనూ అమలు, వంటశాల పరిశుభ్రతను కూడా పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.
పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రత, సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి కుటుంబానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు, ఎంపీడీవో గీతవాణి, ఆర్.ఎస్. డిప్యూటీ తాసిల్దార్ బ్రహ్మయ్య, గ్రామీణ నీటిపారుదల శాఖ సూపరెడ్డెంట్ ఇంజనీర్ మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# వేదవతి ప్రాజెక్టు, గాజులదిన్నె ప్రాజెక్టు పనులకు భూసేకరణ చేయాలి.

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 08:**
వేదవతి ప్రాజెక్టు, గాజులదిన్నె ప్రాజెక్టు విస్తరణకు సంబంధించిన భూసేకరణ పనులను అత్యంత ప్రాధాన్యతతో, నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో వేదవతి ప్రాజెక్టు, గాజులదిన్నె ప్రాజెక్టు విస్తరణ పనులకు సంబంధించి భూసేకరణ అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు.




ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేదవతి ప్రాజెక్టు కు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నెలవారీ లక్ష్యాలతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో భూసేకరణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వేదవతి ప్రాజెక్టు లో భాగంగా మొలగవల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వీలుగా అక్టోబర్ నాటికి 1600 ఎకరాలు భూమిని సేకరించడం లో భాగంగా ముందుగా పెగ్ మార్కింగ్ చేయాలని జలవనరుల శాఖ ఈ ఈ శైలేశ్వర్ ను ఆదేశించారు. పెగ్ మార్కింగ్ అయిన వెంటనే సమాంతరంగా ప్రిలిమినరీ నోటిఫికేషన్ కు తగిన చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్యను ఆదేశించారు. గాజులదిన్నె ప్రాజెక్టు విస్తరణకు సంబంధించి అవసరమైన భూసేకరణ పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. విస్తరణకు అవసరమైన 111 ఎకరాల భూసేకరణకు సంబంధించిన పెగ్ మార్కింగ్, ప్రిలిమినరీ నోటిఫికేషన్ నోటిఫికేషన్ ప్రక్రియలను ఎటువంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ ను ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమాంతరంగా కాంటూర్ సర్వే కూడా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఈ రెండు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పతికొండ ఆర్డీవో ఓబులేసు, ఆదోని సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

# జూనియర్ పుట్బాల్ లో సత్తా

**రాష్ట్ర స్థాయి పోటీలకు గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 08:**
గురురాజ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఫుట్బాల్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జూనియర్ ఇంటర్-డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌ల కోసం నంద్యాల ఫుట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నంద్యాల జిల్లా బాబా నగర్ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు బాలుర జట్టుకు ఎంపికయ్యారు. జూనియర్ డిస్ట్రిక్ట్ ఫుట్బాల్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను షేక్షావలి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 300 మంది క్రీడాకారులు పాల్గొనగా తమ స్కూలుకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారని కొనియాడారు. జూనియర్ బాయ్స్ ఏపీ ఇంటర్ డిస్టిక్ ఛాంపియన్షిప్ పోటీలు ఈ నెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు అన్నమయ్య డిస్టిక్ మదనపల్లిలో జరిగే ఎటువంటి రాష్ట్రస్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ చాటి గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# జిల్లాలో ప్రత్యేక ఓటరు సవరణ నిర్వహణపై అనుమానాలు

**-నిజమైన ఓటరుకు అన్యాయం చేయకండి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 08:** రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత నెల 15వ తేది నుండి నిర్వహిస్తున్న ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన బిఎల్ఓలు ఎన్యుమరేషన్ పత్రాలను ప్రతి ఇంటికి వెళ్లి అందించి మ్యాంపింగ్ చేయాల్సి ఉన్నది. అయితే బీఎల్ ఓలు ఓటర్లకు పూర్తి స్థాయిలో ఎన్యుమరేషన్ పత్రాలను అందించలేదని, గడువు దగ్గరలో ఉన్న నేపథ్యంలో అర్హత కలిగిన నిజమైన ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలు అందకపోతే విలువైన ఓటును కోల్పోవలసి వస్తుందని, కాబట్టి ప్రతి ఒక్కరికి ఎన్యుమరేషన్ పత్రాలను అందించాలని నిజమైన ఓటర్లకు తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించే బాధ్యత అధికారులకు ఉందని తెలియజేస్తూ నేడు డీఆర్ఓ రామునాయక్ కు మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతారెడ్డి, వైసీపీ నేతలు సూర్యనారాయణరెడ్డి, భూమా కిషోర్ రెడ్డి, శశికళారెడ్డి,





దాల్మిల్ అమీర్, తదితర నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... బీఎల్ ఓలు ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను నూటికి నూరు శాతం అందించామని తప్పుడు సమాచారం ఇస్తున్నారని, అందులో వాస్తవాలు లేవని, అధికారులు పరిశీలించి నిజమైన ఓటర్లకు తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని వారు పేర్కొన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలను బీఎల్ ఓలకు సమర్పించేందుకు ఈనెల 14వ తేది గడువు ఉండగా ఇంత వరకు నూటికి నూరు శాతం ఎన్యుమరేషన్ పత్రాలను అందించలేదన్నారు. ఇదిలా ఉంటే శ్రీశైలం నియోజక వర్గంలో బి ఎల్ వో లు లు నూరు శాతం ఎన్యుమరేషన్ పత్రాలను అందించామని చెప్పడం గమనార్హం అన్నారు . ఇప్పటికైనా అధికారులు అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. లేని పక్షంలో ఎన్నికల కమీషన్ కు ఫిర్యాదు చేయవలసి వస్తుందని హెచ్చరించారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

**మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 08:**
రాష్ట్రం లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నిలిపిన ఘనత వైఎస్ కే దక్కుతుందన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా లక్షల మందికి ప్రాణదానం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు ఫీజు రీయింబర్స్ మెంట్ ప్రవేశ పెట్టి లక్షలాది మందిని ఇంజనీర్ లు గాను, డాక్టర్లు గాను చేసిన ఘనత శ్రీ రాజశేఖర్ రెడ్డి దే నని, రైతులకు ఉచిత విద్యుత్ ను ఇచ్చి రైతు రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ దని. కొడుకు గా జగన్ కు వైఎస్ ను ఆరాధించే హక్కు ఉందేమో గాని పార్టీ పరంగా ఆయన ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీ సొత్తు గానే మిగులుతారని పేర్కొన్నారు. నిజమైన వారసురాలు శ్రీమతి వైయస్ షర్మిల రెడ్డి మాత్రమే నని పేర్కొన్నారు.శ్రీమతి సోనియా గాంధీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ ల సహకారంతోనే ఆయన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాట లో నిలిపారన్నారు.



బ్రతికినంత కాలం ఆయన కాంగ్రెస్ పార్టీ లోనే కొనసాగారని గుర్తు చేసుకున్నారు. నీటి ప్రాజెక్టుల మీద వారికి ఉన్న అవగాహన ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గాని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కానీ లేవని వారిద్దరూ సొంత ప్రయోజనాల కొరకే ప్రభుత్వంలో పనిచేశారు తప్పితే ప్రజల కొరకు ఏమాత్రం కష్టపడలేదని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రం నిత్యం ప్రజల ఆశయాలకు అనుగుణంగా వారి అభివృద్ధి కాంక్షించిన వ్యక్తిగా ప్రజల్లో ముద్ర వేసుకున్న వ్యక్తి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారి చివరి కోరిక రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రి చేయడమేనని చెప్పేవారు వారి ఆశయం కొరకు ఈరోజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరు కూడా రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రి చేసి రాజశేఖర్ రెడ్డి కలలను పూర్తి చేయాలని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన హామీలు ప్రత్యేక హోదాతో రాష్ట్ర అభివృద్ధి యువతకు ఉద్యోగ అవకాశాలు ఉపాధి అవకాశాలు మెరుగుపడి రాష్ట్రం మొత్తం అభివృద్ధి చెందుతుందని కోరుకుంటున్నాను
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టౌన్ అధ్యక్షుడు దాసరి చింతలయ్య నంద్యాల జిల్లా ఇంచార్జి చాకలి పుల్లయ్య, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు, జిల్లా కోశాధికారి ఎం.ఎ ప్రసాద్,భూషణం, మైనార్టీ సీనియర్ నాయకులు హమీద్, ఆనంద రావు, హసన్, హుసేన్ భాష, హనుమంతు మొదలగు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గంగవరంలో 'కమల' వికాసం..

**-బిజెపిలో చేరిన 50 కుటుంబాలు -ఘనంగా బీజేపీ జండా ఆవిష్కరణ**

**-నంద్యాల జిల్లాలో తిరుగులేని శక్తిగా అవతరిస్తున్న బీజేపీ -అభిరుచి మధు నాయకత్వంలో 'చేరికల పర్వం'**

**--కూటమి అభ్యర్థుల గెలుపుతోనే గ్రామాభివృద్ధి: జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు.**









**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 08:**
నంద్యాల జిల్లాలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని శక్తిగా అవతరిస్తోంది. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు వ్యూహాత్మక నాయకత్వంలో పార్టీ రోజురోజుకూ బలోపేతమవుతోంది.సిరివెళ్ళ మండల పరిధిలోని గంగవరం గ్రామంలో బుధవారం పార్టీ ముఖ్య నాయకులు సాంబశివుడు, ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం, బహిరంగ సభ ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పార్టీ జెండాను ఆవిష్కరించి, సభలో ప్రసంగించారు.

**జిల్లాలో వేగంగా పెరుగుతున్న బిజెపి గ్రాఫ్**

నంద్యాల జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ బీజేపీ గ్రాఫ్ వేగంగా పెరుగుతోంది. అభిరుచి మధు నాయకత్వ శైలికి, కేంద్ర ప్రభుత్వ ప్రజాసంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కమలం గూటికి చేరుతున్నారు. తాజాగా గంగవరం గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు ఒకేసారి బీజేపీలో చేరాయి. వారికి అభిరుచి మధు కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జిల్లాలో ప్రతి రోజు ఈ 'చేరికల పర్వం' చూసి ప్రతిపక్ష పార్టీలు సైతం ఆందోళనలో పడ్డాయి.

**కేంద్ర పథకాలతోనే పల్లెల్లో ప్రగతి**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అభిరుచి మధు ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.
కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని,. రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని ఆదరించి గంగవరం గ్రామాభివృద్ధికి ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు
బీజేపీ శ్రేణుల భారీ చేరికలతో గంగవరం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ బహిరంగ సభలో ఎంపీటీసీ భగవాన్, స్టేట్ సీడ్ కన్వీనర్ నాగేశ్వర రావు, కశెట్టి చంద్రశేఖర్, పసుపులేటి రవీంద్ర కుమార్, మధుగోపాల్‌తో పాటు గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు, మహిళలు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# నంద్యాలలో ఘనంగా వైఎస్సార్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ..

**తరలివచ్చిన జనసంద్రం! -నంద్యాలలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం.!**

**-రానున్నది జగనన్న పాలన, రాజన్న రాజ్యం. -మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ధీమా.**

**-కుట్రలతో విగ్రహాలు తొలగించగలరు.. ప్రజల గుండెల్లోని రాజన్నను చెరపలేరు: శిల్పా రవి రెడ్డి !**

**-2.0 మొదలైంది.. జగనన్న పాదయాత్రతో బ్లాక్ బస్టర్ హిట్ ఖాయం: శిల్పా రవి రెడ్డి.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూలై 08:**
నంద్యాల జిల్లా కేంద్రం శ్రీనివాస సెంటర్ నందు నేడు దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర రెడ్డి కాంస్యవిగ్రహాన్ని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ఆద్వర్యంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఎర్రబోతుల... మాజీ ఎమ్మెల్యేలు బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, కాటసాని రామిరెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, నందికోట్కూర్ ఇంచార్జీ డా. ధారా సుధీర్, ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ పి పి నాగిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్సీ చైర్మన్ డాక్టర్ నౌమన్, శిల్ప భువనేశ్వర్ రెడ్డి ,వైసీపీ ముఖ్యనేతలు కలిసి ఘనంగా ఆవిష్కరించారు. ముందుగా నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి గృహం నుండి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల భారీ ర్యాలీగా బయలుదేరి శ్రీనివాస సెంటర్ కు చేరుకోవడం జరిగింది. వైసీపీ నేతలు డా. వైఎస్సార్ కాంస్యవిగ్రహానికి గజమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నివాసం నుండి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు భారీ ర్యాలీగా శ్రీనివాస సెంటర్‌కు చేరుకున్నారు. అనంతరం నేతలంతా కలిసి వైఎస్సార్ విగ్రహానికి గజమాలలు వేసి నివాళులు అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మహానేత విగ్రహ ఆవిష్కరణకు అశేష జనవాహిని తరలిరావడమే వైఎస్సార్‌పై ఉన్న అపారమైన అభిమానానికి నిదర్శనమన్నారు. డాక్టర్ వైఎస్సార్ హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ మరువలేదని.. ఆయన బాటలోనే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ముందుకు నడిపించారని, సంక్షేమం అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. నంద్యాలలో ఈ భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో ఇక్కడున్న వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసి, ఇక ఇక్కడ విగ్రహం ఏర్పాటు కాదేమో అని కొందరు భావించారని కానీ ఫైబర్ విగ్రహం స్థానంలో మరింత పటిష్టమైన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి చూపించామన్నారు. "కుట్రలు పన్ని మహానేత విగ్రహాన్ని తీసేయగలిగారేమో కానీ.. ప్రజల గుండెల్లో ఉన్న రాజన్నను ఎవ్వరూ చెరపలేరన్నారు. 2009లో మరణించిన నేతకు 2026లో కూడా ఇంతమంది అభిమానులు ఉన్నారంటే ఆయన ఎంత గొప్ప నాయకుడో అర్థం చేసుకోవచ్చని." అని శిల్పా రవి రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కేవలం మూడు సంవత్సరాల వ్యవధి మాత్రమే ఉందని.. ఇప్పటికే మొదటి హాఫ్ (సగం కాలం) పూర్తయిందని, రెండో హాఫ్ మొదలైందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టబోయే పాదయాత్రతో పార్టీ 'బ్లాక్ బస్టర్ హిట్' కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో నంద్యాల నుంచే విజయప్రస్థానం మొదలుపెట్టి.. జిల్లాలోని 7 నియోజకవర్గాలతో పాటు పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుని తీరుతామని సవాల్ విసిరారు. ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు మరియు నంద్యాల పట్టణ ప్రజలకు శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీశైలం పరిశీలకుడు పి పి మధుసూదన్ రెడ్డి, డోన్ పరిశీలకుడు దేశం సుధాకర్ రెడ్డి, నంద్యాల పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ నెంబర్లు సాయినాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, స్టేట్ మహిళ జనరల్ సెక్రటరీ శశికళ రెడ్డి, స్టేట్ రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, స్టేట్ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ శంకర్ నాయక్, స్టేట్ లీగల్ సెల్ సభ్యులు,మాజీ మున్సిపల్ చైర్మన్ మభూన్నిసా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, వైసిపి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు విజయ శేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, మహేశ్వర రెడ్డి, ఎంపీపీలు ఆర్థర్ సైమన్, శెట్టి ప్రభాకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు అనిల్ అమృతరాజు, రసూల్ ఆజాద్, టైలర్ శివ,టి వి రమణ, కారు రవికుమార్, దేవ నగర్ భాష, శివనాగిరెడ్డి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ లీగల్ సెల్ సభ్యులు మాజీ కౌన్సిలర్స్, వైసీపీ ఇన్చార్జిలు, మాజీ సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

---

## ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో.. కాన్వాయ్ రిహార్సల్స్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 08:**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మీ భూమి – మీ హక్కు కార్యక్రమంలో భాగంగా బనగానపల్లిలో పర్యటించనున్న సందర్భంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లలో భాగంగా నేడు బనగానపల్లిలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహించారు. ఈ రిహార్సల్స్‌ను నంద్యాల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్, ముఖ్యమంత్రి సెక్యూరిటీ వింగ్ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున, డీఎస్పీ చంద్రశేఖర్ మరియు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. రిహార్సల్స్ సందర్భంగా ముఖ్యమంత్రి కాన్వాయ్ ప్రయాణించే మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించి, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, రూట్ సెక్యూరిటీ, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేస్తూ, ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత పకడ్బందీగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండి సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యూనిట్ ఇంచార్జి సమావేశంలో పాల్గొన్న 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 08:** నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు ప్రతినెల బుధవారం రోజున యూనిట్ పరిధిలో నిర్వహించే వార్డు స్థాయి టీడీపీ యూనిట్,కార్యకర్తల సమావేశాన్ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు,నంద్యాల ఎమ్మెల్యే,న్యాయ,మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎండి.ఫరూక్, వారి కుమారులు ఎన్ ఎండి.ఫిరోజ్, ఎన్ ఎండి.ఫయాజ్ ఆదేశాల మేరకు ఈరోజు 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు వార్డు టీడీపీ ఇంచార్జి( యూనిట్ ఇంచార్జి) తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఒక్క రూపాయికే రుచికరమైన భోజనం పంపిణీ.

**...గోళ్ళ రాజేష్ సేవా కార్యక్రమాల నిర్వాహకులు సీనియర్ రిపోర్టర్ నూర్ భాషా.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 08:**
నంద్యాల నియోజకవర్గంలో గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒక్క రూపాయికే పేట్ చపాతి,కర్రి,పప్పు,ఒక్క రూపాయికే రుచికరమైన కరమైన భోజనం ప్రజలకు మీనాక్షి దేవి అమ్మవారి దీవెనలతో నంద్యాల ప్రజలందరి ప్రేమ, అభిమానులతో నిరంతరాయంగా కొనసాగుతున్నాయని గోళ్ళ రాజేష్ సేవా కార్యక్రమాల నిర్వహకులు సీనియర్ ఇప్పుడా నూర్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత సామాజిక సేవకుడు గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్న విషయం గుర్తు చేశారు. అందులో భాగంగా 1రూపాయికే చపాతి,కర్రీ, పప్పు,ఒక్క రూపాయికే రుచికరమైన నాణ్యత కరమైనటువంటి భోజనం పంపిణీ కార్యక్రమం ఆ జగన్మాత మీనాక్షి దేవి ఆశీస్సులతో నంద్యాల నియోజకవర్గ ప్రజల ఆప్యాయత ఆదర అభిమానాలతో ప్రజలందరికీ సంఘమిత్ర పక్కన ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో ఒక రూపాయికే ప్లేట్ చపాతి, మరియు ఒక రూపాయికి రుచికరమైన భోజనం పంపిణీ..
అదేవిధంగా గోళ్ళ రాజేష్ ఏర్పాటు చేసిన మొబైల్ క్యాంటీన్ ద్వారా ప్రతిరోజు నంద్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలలో సంచరిస్తూ మొబైల్ క్యాంటీన్ ద్వారా ఆకలిగా ఉన్న ప్రతి ఒక్కరికి కేవలం ఒక్క రూపాయికే రుచికరమైన ప్లేట్ చపాతి కర్రి పప్పు నాన్యతకరమై భోజనం పంపిణీ చేస్తూ కడుపు నింపుతూ మానవత్వానికి ప్రతీకగా నిలిచారు గోళ్ళ రాజేష్ అన్నారు. గోళ్ళ రాజేష్ పై నంద్యాల నియోజకవర్గ ప్రజలందరూ ఇంత ప్రేమ అభిమానాలు వారందరి ఆశీస్సులు ఇలాగే గోళ్ళ రాజేష్ పై కొనసాగాలని రానున్న కాలంలో గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో మరికొన్ని నూతన సంక్షేమ పథకాలు సేవా కార్యక్రమాలు నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగబోతున్నాయని ఈ సందర్భంగా నూర్ భాషా తెలిపారు. ఈ సందర్భంగా భోజనం చేసిన కొందరు మహిళలు మాట్లాడుతూ ఈ కాలంలో కడుపులో పుట్టిన బిడ్డలే తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు అలాంటిది మహానుభావుడు రూపాయికే అందరు కడుపు నింపుతున్నందుకు మూల రాజేష్ ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

## నంద్యాల జిల్లా అభివృద్ధి హామీలను నెరవేర్చాలి.

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 08:**
కూటమి ప్రభుత్వం నంద్యాల జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న పెండింగ్ ప్రాజెక్టులు, ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిన జిల్లా ప్రగతిని గాడిలో పెట్టడంలో, సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. గతంలో అలగనూరు రిజర్వాయర్ నిర్మిస్తామని రైతులకు, ప్రజలకు పెద్ద ఎత్తున హామీ ఇచ్చారని, అయితే ఆ నిర్మాణ పనులను ఎప్పటిలోగా పూర్తి చేసి సాగునీరు అందిస్తారో ముఖ్యమంత్రి తన పర్యటనలో బహిరంగంగా వెల్లడించాలన్నారు. అదేవిధంగా నంద్యాల జిల్లా కేంద్రంలో 'సీడ్ హబ్' (విత్తన కేంద్రం) ఏర్పాటుకు సంబంధించి అసలు స్థల సేకరణ ఎక్కడ జరిగిందో, పనులు ఎక్కడివరకు వచ్చాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని నిలదీశారు. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలంలో టమోటా రైతులను ఆదుకునేందుకు ప్రతిపాదించిన టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఎంతవరకు పురోగతిలో ఉందో చెప్పాలని, అది కేవలం కాగితాలకే పరిమితమైందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన నిల్వ సౌకర్యాలు, ప్రాసెసింగ్ యూనిట్లు లేక జిల్లాలో టమోటా రైతులు రోడ్లపై పంటను పారబోసుకునే పరిస్థితి నేటికీ మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
బనగానపల్లె నియోజకవర్గంలోని పీడిత ప్రాంతమైన దద్దనాల చెరువును ఎస్సార్బీసీ కాల్వ ద్వారా కృష్ణా నీటితో నింపి, ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందో పాలకులు సమాధానం చెప్పాలన్నారు. వలసల జిల్లాగా పేరుగాంచిన నంద్యాలలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు. మరోవైపు శ్రీశైలం ముంపు నిర్వాసితులు తమ న్యాయమైన పరిహారం, సమస్యల పరిష్కారం కోసం గత 104 రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా చొరవ తీసుకుని, నిర్వాసితులతో మాట్లాడి వారి సమస్యను తక్షణమే పరిష్కరించి ఈ క్షణమే దీక్ష విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆరు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని జిల్లాలో సాగు, తాగునీరు, నిరుద్యోగం లాంటి ఎన్నో జ్వలంత సమస్యలు ఉన్నాయని, జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు తీసుకురావాలని సూచించారు. జిల్లా అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోందని, ఇప్పటికైనా ప్రత్యేక శ్రద్ధ చూపి జిల్లా ప్రగతికి సహకరించాలని, లేనిపక్షంలో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలను, రైతులను సమీకరించి సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని రంగనాయుడు హెచ్చరించారు.